క్లుప్తంగా

పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలి



గోశాల నిర్మాణ పనులను పరిశీలిస్తున్న అధికారిణి

సీతానగరం: మండలంలో రెండో విడతగా మంజూరైన గోశాలలు నిర్దేశించిన ప్రదేశంలో నాణ్యతా ప్రమాణాలకు లోబడి గడువులోగా పూర్తి చేయాలని ఏపీఓ భాను సూచించారు. మండలంలోని ఆర్.వెంకంపేట, పణుకుపేట, కాశీపేట గ్రామాల పాడి రైతులకు మంజూరు చేసిన గోశాలల నిర్మాణ పనులను టెక్నికల్ సహాయకులతో కలిసి శనివారం పరిశీలించారు. ఉపాధి పథకం నిధుల గోశాలల నిర్మాణానికి మంజూరు చేస్తున్నట్టు తెలిపారు. ఆమె వెంట టెక్నికల్ సహాయకులు, క్షేత్ర సహాయకులు ఉన్నారు.

పింఛన్‌దారుల సమావేశం రేపు

పార్వతీపురం టౌన్: పింఛన్‌దారుల నెలవారీ సమావేశం సోమవారం ఉదయం 10 గంటలకు రైతుబజారు సమీపంలోని రాష్ట్ర పింఛన్‌దారుల భవనంలో నిర్వహించనున్నట్టు ప్రభుత్వ పింఛన్‌దారుల అసోసియేషన్ జిల్లా కార్యదర్శి గణపతిరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. లైఫ్ సర్టిఫికెట్ రిజిస్ట్రేషన్ కాని వారు ఆధార్ కార్డు, ఫోన్ తీసుకురావాలని, వారి లైఫ్ సర్టిఫికెట్ రిజిస్టరు చేస్తామన్నారు. అనారోగ్యంతో బాధపడుతూ లేవలేని పరిస్థితుల్లో ఉన్న వారి పేరు, ఫోన్ నంబరు తెలియజేస్తే వారి ఇంటి వద్దే లైఫ్ సర్టిఫికెట్ రిజిస్ట్రేషన్ చేస్తున్నట్టు తెలిపారు.

విద్యార్థులకు ఆల్బెండజోల్ వేయాలి



మాట్లాడుతున్న ఎంఈఓ సూరిదేముడు

సీతానగరం: విద్యార్థులకు నులి పురుగుల నివారణ మాత్రలు(ఆల్బెండజోల్) ఆయా పాఠశాలలో సోమవారం వేయాలని ఎంఈఓ జి.సూరిదేముడు అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ పి.త్రివిక్రమరావు అధ్యక్షతన నులి పురుగల నివారణ మాత్రలు వేయడంపై పంచాయతీ కార్యదర్శులు, ఉపాధ్యాయులు, ఏఎన్ఎంలతో సమీక్ష సమావేశం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పాఠశాలల్లో ప్రీ స్కూల్ పిల్లల నుంచి ఇంటర్మీడియట్ చదువుతున్న విద్యార్థుల వరకు ఈ మాత్రలు వేయాలని అన్నారు. పీహెచ్‌సీ సీహెచ్ఓ ఎస్వీ రమణ మాట్లాడుతూ వైద్య సిబ్బంది పర్యవేక్షణలో మాత్రలు వేయాలని సూచించారు. సమావేశంలో ఈఓపీఆర్‌డీ కుమారవర్మ, పీఆర్ సిబ్బంది, హెచ్ఎంలు పాల్గొన్నారు.

పొంచి ఉన్న ప్రమాదం



ఎమ్మార్‌నగరంలోని కొత్తవీధిలో రక్షణ కంచె లేని ట్రాన్స్‌ఫార్మర్

పార్వతీపురం రూరల్: మండలంలోని పలు గ్రామాల్లో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు ప్రమాదకరంగా మారాయి. రోడ్డుకు ఆనుకొని రక్షణ కంచెలేని ట్రాన్స్‌ఫార్మర్లతో ప్రమాదం పొంచి ఉందని ఆయా గ్రామాల ప్రజలు భయాందోళనలు చెందుతున్నారు. ముఖ్యంగా చిన్నారుల చేతికందే ఎత్తులో పలుచోట్ల ఇవి ఉండడంతో భయపడుతున్నారు. అలాగే మూగజీవాలు అటుగా వెళ్తే ప్రమాదం తప్పదని స్థానికులు చెబుతున్నారు. ఇప్పటికైనా విద్యుత్ శాఖాధికారులు స్పందించి తగు కంచెలు ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

తెగుళ్లు అధిగమించాలి..

పాలకొండ రూరల్: మారుతున్న ఉష్ణోగ్రతల నేపథ్యంలో పుచ్చ పంటకు తెగుళ్లు ఆశించే అవకాశం ఉందని ఉద్యానవన శాఖాధికారి తమ్మినేని అమరేశ్వరి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పంట ప్రారంభ దశలో తామర పురుగు, రసం పీల్చు, తేనుబంక, ఎర్రనల్లి తెగుళ్ల కారణంగా నష్టం వస్తుందని పేర్కొన్నారు. వీటిని అధిగమించేందుకు నీలి రంగు, పసుపు రంగు జిగురు అట్టలు ఎకరాకు పది వరకు ఏర్పాటు చేయాలని సూచించారు. 1500 పీపీఎం కలిగిన వేపనూనె లీటర్ నీటిలో కలిపి 10 రోజుల వ్యవధిలో ఒకసారి పిచికారీ చేయాలన్నారు. తామరపురుగు నివారణకు ఫిప్రోనిల్ 2 మిల్లీ లీటర్లు లేదా ఇమిడాక్లోప్రైడ్ 0.3 ఎం.ఎల్ లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేయాలని సూచించారు. తేనెబంక నివారణకు డైమిథేయేట్ 400 ఎం.ఎల్‌ను 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలన్నారు. అలాగే ఎర్రనల్లి నివారణకు స్పైరోమెసిన్ 1.25 మిల్లీలీటర్లు లేదా ప్రొపర్‌గైట్ 2 ఎం.ఎల్ లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేయాలని సూచించారు. బూడిద తెగులు నివారణకు హెక్సాకొనజోల్ లీటర్ నీటిలో 2 ఎం.ఎల్ వంతున కలిపి పిచికారీ చేయాలని పేర్కొన్నారు.

ఆర్టీసీ ఆదాయానికి ప్రైవేటు

- రోజుకు రూ.30 నుంచి 40వేలకు పైగా నష్టం
- కార్లు, ఆటోల్లోనే ఎక్కువ మంది ప్రయాణం
- పార్వతీపురం డిపో పరిధిలో 100 బస్సులు



పార్వతీపురం ఆర్టీసీ డిపో ఇన్ గేట్ వద్ద ప్రయాణికుల కోసం వేచి ఉన్న ఆటోలు

పార్వతీపురం టౌన్:

జిల్లా కేంద్రమైన పార్వతీపురం నుంచి అనేక రూట్లలో ఆర్టీసీ బస్సులు నిత్యం వేలాది మందిని తమ గమ్యస్థానాలకు చేర్చుతున్నాయి. సాలూరు, పాలకొండ, కురుపాం, విజయనగరం, విశాఖపట్టణం, రాజమండ్రి, విజయవాడతో పాటూ జిల్లాలో వివిధ మార్గాల్లో బస్సు సర్వీసులు నడుపుతున్నారు. అయినప్పటికీ ప్రయాణికుల రవాణా అవసరాలకు అనుగుణంగా ఆర్టీసీ బస్సులు తిప్పకపోవడంతో వందల మంది ప్రైవేటు వాహనాలను ఆశ్రయిస్తున్నారు. ప్రైవేటు బస్సులు, ఆటోలు, కార్లలో ప్రయాణికులు వెళ్తుండడంతో ఆర్టీసీ ఆశించిన ఆదాయాన్ని ఆర్జించలేకపోతోంది.

● నిత్యం 22 వేల మంది రాకపోకలు

ఆర్టీసీ డిపో నుంచి ప్రతి నిత్యం సుమారు 22 వేల మంది తమ గమ్య స్థానాలకు చేరుతున్నారు. జిల్లా కేంద్రం, ఒడిశా సరిహద్దు కావడంతో పరిసర ప్రాంతాల్లోని వివిధ మండలాల్లో ప్రభుత్వ కార్యాలయాల్లో పనిచేసే ఉద్యోగులు, ఉపాధ్యాయులు, వ్యాపారులు సైతం ఆర్టీసీ బస్సుల్లోనే ప్రయాణిస్తుంటారు. కలెక్టరేట్, ఎస్పీ కార్యాలయం, కోర్టు, జిల్లా ఆస్పత్రి, ఆయా కార్యాలయాల్లో పనులు చూసుకోవడానికి పరిసర గ్రామాలు, మండల కేంద్రాల నుంచి పార్వతీపురం పట్టణానికి వచ్చే వారి సంఖ్య అధికంగానే ఉంటుంది. వీరిలో అధిక శాతం మంది ఆర్టీసీ బస్సుల్లోనే రాకపోకలు సాగిస్తుంటారు.

● డిపోలో 100 బస్సులు

ఆర్టీసీ డిపోలో హైర్, ప్రభుత్వ బస్సులు కలిపి 100 ఉన్నాయి. వీటి ద్వారా డిపోకు నిత్యం రూ.17.50 లక్షల ఆదాయం వస్తుంది. ముఖ్యంగా విశాఖపట్టణం, విజయనగరం, సాలూరు, పాలకొండ వెళ్లే బస్సులకు అధిక ఆదాయం వస్తుంది. కూనేరు, కురుపాం వంటి ప్రాంతాలకు ప్రయాణికుల రద్దీ పెద్దగా ఉండని కారణంగా ఎక్కువ బస్సులు తిప్పడం లేదు. ఈ మార్గాల్లో ప్రయాణికులను ప్రైవేట్ వాహనాల్లో తరలించడాన్ని కట్టడి చేస్తే డిపోకు మరికొంత ఆదాయం వచ్చే అవకాశం ఉంది.

నిబంధనలకు తూట్లు

ఆర్టీసీ బస్టాండుకు కనీసం 500 మీటర్లలోపు ప్రైవేట్ వాహనం నిలపకూడదని, ప్రయాణికులను తరలించకూడదని నిబంధనలు ఉన్నా అధికారుల నిర్లక్ష్యంతో నిబంధనలు పట్టించుకోవడం లేదు. దీంతో ప్రైవేట్ వాహనాల జోరు కొనసాగుతోంది. ఆర్టీసీ డిపో నుంచి నిత్యం విశాఖపట్టణానికి బస్సులు తిప్పుతున్నారు. విశాఖపట్టణానికి ఉన్న డిమాండ్‌ను ప్రైవేట్ వాహనాలు కూడా సొమ్ము చేసుకుంటున్నాయి. సుమారు 8 వరకు ప్రైవేటు బస్సులు ఆర్టీసీ కాంప్లెక్స్ సమీపంలో ప్రయాణికులను తరలిస్తున్నారు. కురుపాం, కూనేరు, కొమరాడ, ఒడిశా రాష్ట్రం అలమండ, నారాయణపట్టణం చుట్టుపక్కల గిరిజన గ్రామాలకు వెళ్లే రూట్లలో ఆర్టీసీ బస్సులు పెద్దగా తిప్పకపోవడంతో ఆయా రూట్లలో ఆటోల వారిదే రాజ్యంగా మారింది. ఇలా ప్రైవేట్ వాహనాల దందా కారణంగా ఆర్టీసీ డిపో పరిధిలో రోజుకు సుమారు రూ.30 నుంచి 40వేలకు పైగానే నష్టం వాటిల్లుతుందని అంచనా.

కేసులు నమోదు చేస్తున్నాం..



బస్టాండు వద్ద ప్రైవేట్ వాహనాలు, ఆటోలు నిలపకుండా, ప్రయాణికులను తరలించకుండా ఆర్టీసీ సెక్యూరిటీ విభాగం ద్వారా కట్టడి చేస్తున్నాం. పాత బస్టాండు వద్ద ఆటోలకు కూడా అడ్డుకట్ట వేస్తున్నాం. ఆయా వాహనాలను నిరోధించడానికి పోలీసుల సాయం తీసుకుంటున్నాం. ఆర్టీసీ బస్టాండ్‌ల నుంచి ప్రయాణికులను తరలించే ప్రైవేట్ వాహనదారులపై కేసులు నమోదు చేసి చట్టపరంగా చర్యలు తీసుకుంటాం.

– కనకదుర్గ, డిపో మేనేజర్, పార్వతీపురం

పూత విరిసె....జనుము మురిసె



వెంకంపేటలో సాగు చేస్తున్న కట్టిజనుము చేను

పార్వతీపురం: రబీలో ఆరుతడి పంటగా సాగు చేసిన కట్టి జనుము చేలు చూపరులకు కనువిందు చేస్తున్నాయి. పశువుల మేత కొరత తీర్చేందుకు వ్యవసాయ శాఖ అధికారులు రాయితీపై జనుము విత్తనాలు సరఫరా చేశారు. ప్రస్తుతం పూత దశలో వున్న కట్టిజనుము చేలు చూపరులకు ఆహ్లాదాన్ని పంచుతున్నాయి. కట్టిజనుము చేలు పక్వానికి వచ్చిన తరువాత కోత కోసి పనలను కుప్పలుగా నిల్వ చేసి అవసరమైనప్పుడు పశువులకు మేతగా వేస్తామని రైతులు చెబుతున్నారు. మండలంలోని వెంకంపేట, చినబొండపల్లి, తాళ్లబురిడి తదితర గ్రామాలలో కట్టి జనుము పంటను రైతులు సాగు చేస్తున్నారు.

నాణ్యమైన భోజనం పెట్టాలి

పార్వతీపురం టౌన్: ఆశ్రమ పాఠశాలలు, ఎస్సీ, ఎస్టీ, బీసీ గురుకుల పాఠశాల, కళాశాల, సంక్షేమ వసతిగృహాల్లో చదువుతున్న పేద విద్యార్థులకు సన్న బియ్యం సరఫరా చేసి సన్న బియ్యం భోజనాలు పెట్టాలని సామాజిక చైతన్య వేదిక ఉత్తరాంధ్ర కన్వీనర్ పి.రంజిత్‌కుమార్ కోరారు. అలాగే డైట్ చార్జీలు పెంచాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం ఐటీడీఏ కార్యాలయం వద్ద మాట్లాడుతూ రెగ్యులర్, కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఎటువంటి తరహా ఉద్యోగాల నియామకం అయినా నేరుగా ప్రభుత్వమే నోటిఫికేషన్ ఇచ్చి రూల్ ఆఫ్ రిజర్వేషన్, మెరిట్ ఆధారంగా భర్తీ చేయాలన్నారు. ప్రైవేట్ ఏజెన్సీ ద్వారా ఉద్యోగాల భర్తీ ఆలోచన మానుకోవాలని రంజిత్‌కుమార్ డిమాండ్ చేశారు. గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో ఖాళీగా ఉన్న బోధనేతర పోస్టులు భర్తీ చేయాలని డిమాండ్ చేశారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

పాలకొండ రూరల్: వాహన చోదకులు ట్రాఫిక్ నిబంధనలు కచ్చితంగా పాటించాలని పాలకొండ సీఐ మీసాల చంద్రమౌళి అన్నారు. శనివారం స్థానిక కోటదుర్గమ్మ దేవస్థానం కూడలి, రాజాం, వీరఘట్టం రహదారుల్లో వాహన తనిఖీలు చేపట్టారు. డ్రైవింగ్ లైసెన్స్‌లు లేకుండా వాహనాలు నడుపుతున్న మైనర్లకు అవగాహన కల్పించారు. మద్యం మత్తులో డ్రైవింగ్ చేస్తున్న వారికి.. ఓవర్ లోడ్‌తో రాకపోకలు సాగిస్తున్న వారికి అపరాధ రుసుం విధించారు.

ప్రచారం

పాలకొండ: ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల బరిలో ఉన్న పీడీఎఫ్ అభ్యర్థి కోరెడ్ల విజయగౌరికి మద్దతుగా సీపీఎం నాయకులు శనివారం నగరంలో ప్రచారం నిర్వహించారు. ఎన్నికలో మొదటి ప్రాధాన్యత ఓటు విజయగౌరికి వేయాలని సీపీఎం నాయకులు, పలువురు ఉపాధ్యాయులు కోరుతూ కరపత్రాలు పంపిణీ చేశారు.

కందిపప్పు ఇవ్వడం లేదు..



సీతంపేట: ఈ నెల నిత్యావసర సరుకుల సరఫరాలో కందిపప్పు ఇవ్వలేదు. దీంతో లబ్ధిదారులు బయట మార్కెట్‌లో కొనుగోలు చేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. గత నెలలో కొన్ని గ్రామాల్లో లబ్ధిదారులకు కందిపప్పు ఇవ్వగా.. మరికొన్ని గ్రామాల లబ్ధిదారులకు సరఫరా చేయలేదు. ఈ నెల పూర్తిగా సరఫరా నిలిపివేయడంతో లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారు. బహిరంగ మార్కెట్‌లో కిలో కందిపప్పు రూ. 180 వరకు పలుకుతోంది. రేషన్ డిపో ద్వారా అయితే కిలో రూ. 67కే ఇచ్చేవారు. సాధారణ, మధ్య తరగతి ప్రజలు బహిరంగ మార్కెట్‌లో కందిపప్పు కొనలేకపోతున్నారు. సీతంపేట ఏజెన్సీలో 16,500 వరకు తెలుపు రేషన్‌కార్డులు ఉన్నాయి. వీరికి 35 టన్నుల కందిపప్పు ప్రతి నెలా అవసరం అవుతుంది. ఈ నెల సివిల్ సప్లై ద్వారా కేవలం బియ్యం, పంచదార మాత్రమే ఇస్తున్నారు. బయట మార్కెట్‌లో నిత్యావసర సరుకులు, కూరగాయల ధరలు బెంబేలెత్తిస్తున్నాయి. ఈ తరుణంలో కనీసం కందిపప్పు కూడా సరఫరా చేయకపోతే ఎలా అన్ని లబ్ధిదారులు ప్రశ్నిస్తున్నారు. ఈ విషయమై సివిల్ సప్లైస్ డీటీ మధుసూదనరావు వద్ద ప్రస్తావించగా కొన్ని రేషన్ డిపోలకు మాత్రమే కందిపప్పు వచ్చిందన్నారు.

● వైభవంగా ఏకాదశి పూజలు



పార్వతీపురం టౌన్: శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో స్వామి వారికి పూజలు



పార్వతీపురం రూరల్: సంగంవలస రామాలయంలో ప్రత్యేక పూజల్లో పాల్గొన్న భక్తులు



సీతానగరం: లచ్చయ్యపేటలో స్వామివారిని దర్శించుకునేందుకు క్యూకట్టిన భక్తులు

మాఘశుద్ధ భీష్మ ఏకాదశి సందర్భంగా సత్యనారాయణస్వామి, శ్రీవేంకటేశ్వరస్వామి, రామ మందిరాల్లో శనివారం ప్రత్యేక పూజలను నిర్వహించారు. భక్తులు దేవాలయాల వద్ద దర్శనాల కోసం క్యూ కట్టారు. పవిత్రమైన ఏకాదశి సందర్భంగా హరిహరాదులకు ప్రత్యేక పూజలు చేశారు. మహిళలు ప్రత్యేక పూజలు, అర్చనలు నిర్వహించారు.

– సాక్షి నెట్‌వర్క్



బలిజిపేట: చిలకలపల్లి ఆలయంలో పూజలందుకున్న స్వామివారు



పార్వతీపురం టౌన్: శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో భక్తులు

లారీ పరిశ్రమను ఆదుకోరూ...

సాలూరు: విజయవాడ తరువాత రాష్ట్రంలో అత్యధిక లారీలు ఉన్న సాలూరు లారీ పరిశ్రమ నేడు చాలా దయనీయ పరిస్థితుల్లో ఉందని, మంత్రి సంధ్యారాణి ప్రభుత్వంతో చర్చించి ఆదుకోవాలని రిపబ్లికన్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి గొంప ప్రకాశరరావు కోరారు. శనివారం పట్టణంలో ఆయన మాట్లాడుతూ, ఆయిల్ ధరలు పెరగడం, టోల్ గేట్లు, ట్యాక్సులు పెరగడంతో లారీ యజమానులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. అప్పుల ఊబిలో యజమానులు, ఆకలి కేకలతో కార్మికులు అలమటిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

లారీ ఓ ట్రిప్పు వెళ్లి వచ్చాక యజమానికి డబ్బులు మిగలకపోగా, సొంత డబ్బులు పెట్టుకోవాల్సి వస్తుందని వాపోయారు. దీనిపై ప్రభుత్వం లారీ యజమానులతో చర్చించి పరిశ్రమను ఆదుకోవాలని కోరారు. మంత్రి సంధ్యారాణి ఈ విషయంలో చొరవ తీసుకోవాలని, అలాగే మండలంలో జీగిరాం జ్యూట్ ఫ్యాక్టరీని తెరిపించి కార్మికులకు ఉపాధి కల్పించాలని కోరారు.

అనారోగ్యాన్ని సకాలంలో గుర్తించాలి



టీకా కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ జగన్‌మోహనరావు

పార్వతీపురం టౌన్: అనారోగ్య సంకేతాలను సకాలంలో గుర్తించాలని వైద్య శాఖ జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ టి.జగన్‌మోహనరావు అన్నారు. 20వ వార్డులో టీకా కార్యక్రమం, 18 వార్డులో సాంఘిక సంక్షేమ హాస్టల్‌లో శనివారం నిర్వహించిన వైద్య శిబిరాన్ని ఆయన పరిశీలించారు. టీకా అర్హుల జాబితా పరిశీలించి షెడ్యూల్ ప్రకారం పిల్లలకు టీకాలు వేయడం జరుగుతుందా.. అని తేదీలను గమనించారు. టీకా కార్డు తనిఖీ చేసి గడువు తేదీలను తల్లిదండ్రులకు ముందుగా తెలియజేయాలన్నారు. టీకా వయల్స్‌పై వినియోగించిన తేదీ నమోదు తప్పనిసరి అని వైద్య సిబ్బందిని ఆదేశించారు. శిశు ఆరోగ్య విషయమై తల్లిదండ్రులతో మాట్లాడి తగు జాగ్రత్తలు సూచిస్తూ వేరే ఊరు వెళ్లాల్సి వస్తే టీకా కార్డు వెంట తీసుకువెళ్లాలన్నారు. వైద్య శిబిరంలో విద్యార్థులకు వైద్యాధికారి నిర్వహించిన ఆరోగ్య తనిఖీలు, వైద్య పరీక్షల వివరాలు ఆయన పరిశీలించారు. విద్యార్థులకు ఏ చిన్న అనారోగ్య సమస్య వచ్చినా సత్వరమే స్పందించి వైద్య సిబ్బంది దృష్టికి తీసుకురావాలని వార్డెన్‌కు సూచించారు. అవసరమైన మందులు వసతిగృహంలో సిద్ధంగా ఉంచాలన్నారు. కార్యక్రమంలో బెలగాం, చర్చివీధి యూపీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ బి.రవిచంద్ర, సూపర్‌వైజర్ పుష్ప, వైద్య సిబ్బంది సావిత్రి, రామలక్ష్మి, హాస్టల్ వార్డెన్ కురమమ్మ, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

సమాజ మార్పుకు చదువే మూలం



పరీక్ష ప్రశ్న పత్రాలను ఆవిష్కరిస్తున్న ఎస్ఎఫ్ఐ, యూటీఎఫ్ నాయకులు

పార్వతీపురం టౌన్:

ప్రతి ఒక్కరు కచ్చితంగా చదువుకోవాలని, అదే పదునైన ఆయుధమని ప్రముఖ కవి, రచయిత గంటేడ గౌరినాయుడు అన్నారు. స్థానిక ఓ ప్రైవేటు డిగ్రీ కళాశాలలో ఎస్ఎఫ్ఐ, యూటీఎఫ్ ఆధ్వర్యంలో ప్రజ్ఞ వికాసం పరీక్ష శనివారం నిర్వహించారు. మొదటగా యూటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎస్.మురళీమోహన్, గంటేడ గౌరినాయుడు, ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు డేవిడ్, సింహాచలం, కళాశాల సిబ్బంది పరీక్ష ప్రశ్న పత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గంటేడ గౌరినాయుడు మాట్లాడుతూ నేటి విద్యార్థులు పరీక్షలు అంటేనే భయాందోళనకు గురవుతూ, చదువును మధ్యలోనే నిలిపివేసే పరిస్థితులు కనిపిస్తున్నాయన్నారు. ఈ నేపథ్యంలో విద్యార్థులకు కావలసింది, నైపుణ్యత శిక్షణలని అన్నారు. చదువు ఒక్కటే సమాజాన్ని మార్చగలదని, ఆ చదువుని ప్రతి విద్యార్థి ప్రేమించి ఆస్వాదించాలని అన్నారు. ఎస్.మురళీమోహన్ మాట్లాడుతూ పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు రాబోయే పబ్లిక్ పరీక్షలకు ఈ ప్రజ్ఞ వికాస పరీక్ష దోహదపడుతుందన్నారు. ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు డేవిడ్, సింహాచలం మాట్లాడుతూ ఎస్ఎఫ్ఐ విద్యార్థుల, విద్యారంగ సమస్యలతో పాటు విద్యార్థుల నైపుణ్యతను పెంచి, భవిష్యత్తు ఉన్నత చదువులకు ప్రోత్సహించేటట్లుగా వికాసం పరీక్షలు నిర్వహిస్తుందన్నారు.

పరీక్షల్లో 6735 మంది విద్యార్థులు

ఎస్ఎఫ్ఐ, యూటీఎఫ్ ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా నిర్వహించిన ప్రజ్ఞ వికాసం పరీక్షల్లో 6735 మంది విద్యార్థులు, 74 పరీక్ష కేంద్రాలలో పాల్గొన్నారని తెలిపారు. వీరిలో మొదటి స్థానంలో ప్రతిభ కనబరిచిన వారికి ప్రైజ్ మనీతో పాటు బహుమతులు అందజేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు సురేష్, సంధ్య, రాజేష్, సాయి, భాస్కర్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

నులి పురుగులను నులిమేద్దాం..



డీ వార్మింగ్ డే సందర్భంగా రూపొందించిన అవగాహన కరపత్రం

- 10న డీ వార్మింగ్ డే
- పంపిణీకి ఆల్బెండజోల్ మాత్రలు సిద్ధం
- డిప్యూటీ డీఎంహెచ్ఓ కేవీ పార్వతి



భామిని: పిల్లలలో పలు రుగ్మతలకు కారణమైన నులి పురుగుల నిర్మూలనకు రంగం సిద్ధమైంది. జాతీయ నులి పురుగుల నిర్మూలన దినం సందర్భంగా పిల్లలలో అధిక వ్యాధులకు కారణమైన కడుపులోని నులి పురుగులను ఆల్బెండ్‌జోల్ మాత్రలతోనే నిర్మూలించడానికి అధికారులు ఏర్పాట్లు చేశారు. నులి పురుగుల వల్ల శారీరక పెరుగుదల తగ్గుముఖం పడుతుందని వైద్యులు చెబుతున్నారు. ఆకలి మందగించడం, బలహీనత, ఆందోళన, కడుపునొప్పి, వికారం, వాంతులు – విరేచనలు, మలంలో రక్తం పడడం వంటి లక్షణాలు కనిపిస్తే నులి పురుగులు ఆశించినట్లు అనుమానించాల్సిందే. భోజనానికి ముందు చేతులు శుభ్రంగా కడుక్కుంటే కొంతవరకు నులి పురుగులను నివారించవచ్చని వైద్యులు సలహా ఇస్తున్నారు. ఈ నెల 10న డీ వార్మింగ్ డే సందర్భంగా 19 ఏళ్ల లోపు చిన్నారు లందరికీ మాత్రలు పంపిణీ చేయనున్నారు.

19 ఏళ్ల లోపు వారందరికీ..

పార్వతీపురం మన్యం జిల్లాలో 19 ఏళ్ల లోపు చిన్నారులు 1,90,438 మంది ఉన్నట్లు గుర్తించారు. 2054 అంగన్‌వాడీ కేంద్రాల్లో గల 19,106 మంది చిన్నారులచే మాత్రలు మింగిస్తారు. ఇందులో 1 నుంచి 2 ఏళ్ల లోపు పిల్లలకు సగం మాత్ర వేయాలి. ఆపై వయసున్న వారిచే ఒక మాత్ర మింగించాలి.

ఏర్పాట్లు పూర్తి..

ప్రధానంగా విద్యార్థులలో రక్తహీనత నిర్మూలనకు కార్యాచరణ చేపట్టాం. అలాగే వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కల్పిస్తున్నాం. చిన్నారులందరికీ మాత్రలు పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు పూర్తి చేశాం. జిల్లాను వివిధ రూట్లుగా విభజించి సరిపడా సిబ్బందిని నియమించాం.

– కె.విజయపార్వతి, డిప్యూటీ డీఎంహెచ్ఓ, సీతంపేట

